
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
చిత్తూరు
జిల్లా వార్తలు
సోమవారం 25 మార్చి 2024



శ్రేణుల్లో స్ఫూర్తినింప జగన్నాటకానికి తెరదింప

● నేడు, రేపు చంద్రబాబు కుప్పం పర్యటన

ఎన్నికల ముంగిట అధినేత రాక టీడీపీ శ్రేణులను ఉత్తేజితులను చేస్తోంది. అధినేత దిశానిర్దేశంతో మరింతగా పోరాట స్ఫూర్తి నింపుకొని ఎన్నికల రణరంగంలో ఎదురులేని విజేతలుగా నిలవాలన్న ఉద్వేగంతో ఉవ్విళ్లూరిపోతున్నారు కార్యకర్తలు. ఇక, జగన్‌రెడ్డి హంద్రీ-నీవా పేరుతో చేసిన నీటి మోసాన్ని చంద్రబాబు ఎండగడుతుంటే చూడాలన్న తహతహ వారిలో కనిపిస్తోంది. ఇందుకు ఏమాత్రం తగ్గని ఉత్సుకతతో చంద్రన్న రాకకోసం ఎదురుతెన్నులు చూస్తున్నారు నియోజకవర్గ ప్రజలు. - కుప్పం

తెలుగుదేశం పార్టీ అధినేత, స్థానిక ఎమ్మెల్యే చంద్రబాబు సోమ, మంగళ వారాల్లో కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పేరుకు నియోజకవర్గ పర్యటనే అయినా ఆయన పరిమిత కార్యక్రమాలకు మాత్రమే తన షెడ్యూల్‌ను కుదించుకున్నారు. నిజానికి చంద్రబాబు నియోజకవర్గ శ్రేణులను పలుమార్లు విజయవాడకు పిలిపించుకుని దిశానిర్దేశం చేశారు. ఆపైన డిసెంబరు నెల 29, 30, 31 తేదీలలో కుప్పం పర్యటనకు వచ్చారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ రోడ్ షోలు నిర్వహించి అటు ప్రజలకు, ఇటు పార్టీ శ్రేణులకు కర్తవ్యం బోధించారు. మళ్లీ టీడీపీ వస్తేనే నియోజకవర్గం బాగుపడుతుందని లేదంటే మరో పదేళ్లు వెనక్కు వెళ్లిపోతుందని హెచ్చరించారు. లక్ష ఓట్ల మెజారిటీయే లక్ష్యమని నిర్దేశించారు. అప్పట్నుంచి పార్టీ శ్రేణులు మంచి ఊపులోనే ఉన్నాయి. అయితే ఇది సరిపోదని చంద్రబాబు భావిస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ కూడా వెలువడిన నేపథ్యంలో మరోసారి కుప్పం పర్యటనకు వస్తున్నారు. ప్రజల్లో ఉన్న పూర్తి సానుకూలతను ఓట్లుగా మార్చుకోవాలంటే పార్టీ శ్రేణుల్లో మరింత మార్పు రావాలని చంద్రబాబు నమ్ముతున్నారు. అందువల్లే సోమ, మంగళ వారాల్లో చేయనున్న పర్యటనలో కేవలం పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడమే కార్యక్రమంగా పెట్టుకున్నారు. టీడీపీ అనుబంధ సంఘాలతో విడివిడిగా సమావేశమై, వారిలో పోరాట స్ఫూర్తి నింపనున్నారు. నేతల మధ్య ఏవైనా విభేదాలుంటే తొలగించి, ఈ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఎంత అవసరమో వారికి తెలియజెప్పనున్నారు. అదే సమయంలో బీజేపీ, జనసేనతో కలిసి కూటమిగా ఎన్నికలకు వెళ్లనున్న నేపథ్యంలో ఆ రెండు పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకొని పోవాలని హితవు పలుకనున్నారు. ఇక, ముస్లిం మైనారిటీలతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొననున్నారు. మూడు పార్టీల కలయిక రాష్ట్ర భవిష్యత్తుకు ఎంత అవసరమో వివరించనున్నారు.

జగన్‌రెడ్డి 'నీటి' మోసం ఎండగట్టేందుకు



రాజుపేట వద్ద గేటు ఎగువభాగాన ఎండిన కాలువ

చంద్రబాబు ఈసారి పర్యటనలో పార్టీ శ్రేణుల్లో పోరాట స్ఫూర్తి నింపడమేకాదు, హంద్రీ-నీవా నీటి విడుదల పేరుతో సీఎం జగన్ ఎంత నాటకం ఆడారో, ఎంతగా ఇక్కడి ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నించారో చంద్రబాబు వివరించనున్నారు. దీనికోసం మంగళవారం ప్రత్యేకించి సమయాన్ని కేటాయించుకున్నారు. కృష్ణా నీళ్లంటూ సీఎం విడుదల చేసిన.. రామకుప్పం మండలం రాజుపేట సమీపంలోని కాలువ వద్దకు వెళ్లి మరీ ఆయన మోసాన్ని ఎండగట్టనున్నారు. గత ఫిబ్రవరి నెల 26వ తేదీన కుప్పం పర్యటనకు వచ్చిన సీఎం జగన్‌రెడ్డి, సిద్ధం బహిరంగ సభను నిర్వహించడమే కాక, హంద్రీ-నీవా కాలువ ప్రారంభోత్సవం పేరుతో నాటకానికి తెరలేపారు. పుంగనూరు రిజర్వాయరు నుంచి వి.కోటకు తీసుకొచ్చిన నీటిని అక్కడి నుంచి నిరంతరాయంగా పంప్ చేయించి, నిలువ ఉంచి ప్రారంభోత్సవం రోజున గేటును తెరచి ప్రారంభోత్సవం చేసినట్లు కలరింగ్ ఇచ్చారు. నీటి విడుదల పేరుతో జగన్ పైకెత్తిన ఇనుప గేటును మరుసటి రోజునే అధికారులు తలరించుకు వెళ్లి, విమర్శలు రావడంతో తిరిగి ఏర్పాటు చేయడం ఇది నాటకమనడానికి ప్రత్యక్ష నిదర్శనం. ఆ తర్వాత టీడీపీ శ్రేణులే కాదు, పలువురు సామాన్యులు కూడా ఎండిపోయిన కాలువలోకి వెళ్లి, వీడియోలు చేసి, ఫొటోలు దిగి, ధర్నాలు చేసి జగన్నాటకాన్ని ఎండగట్టారు. మొదట్లో ఏవో కుంటిసాకులతో వివరణలు ఇవ్వబోయిన రాష్ట్ర నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక హెచ్‌ఎన్ఎస్ఎస్ అధికారులు తర్వాత కిమ్మనకుండా ఉండిపోయారు. వైసీపీ నేతలైతే కొన్నిరోజులు ప్రతి విమర్శలు చేసి, తర్వాత పూర్తిగా ఎండిపోయిన కాలువ కళ్లముందు కనిపిస్తుండడంతో ఏమనలేక కిక్కురుమనడం లేదు. ఈ జగన్నాటకాన్ని కాలువ దగ్గరకు వెళ్లి మరీ ప్రత్యక్షంగా చంద్రబాబు ప్రజలకు వివరించనున్నారు. తద్వారా మళ్లీ పొరపాటున వైసీపీ అధికారంలోకి వస్తే ఏం జరుగుతుందో, ఇలా ఎన్ని మోసాలకు తెర లేస్తుందో వారికి తేట తెల్లం చేయనున్నారు.

పర్యటన ఏర్పాట్లు పరిశీలన



పీఈఎస్ హెలిప్యాడ్ వద్ద నాయకుల మంతనాలు

కుప్పంలో చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను ఆదివారం టీడీపీ నాయకులు పరిశీలించారు. పీఈఎస్ ఆస్పత్రిలోని హెలిప్యాడ్‌ను నేతలు పరిశీలించి, అవసరమైన ఏర్పాట్లను పర్యవేక్షించారు. కుప్పంలోని పార్టీ కార్యాలయం ఎదుట ఉన్న ఖాళీ స్థలాన్ని చదును చేయించారు. ఇక్కడ పార్టీలోని వివిధ అనుబంధ సంఘాలతో చంద్రబాబు సమావేశమై ఎన్నికలకు సంబంధించి దిశానిర్దేశం చేయనున్నారు. ఇక, ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో బహిరంగ సభ, వేదిక ఏర్పాట్లపై సమీక్షించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీఆర్ సురేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేటి పర్యటన షెడ్యూల్ ఇదే

సోమవారం ఉదయం 11.25 గంటలకు: బెంగళూరు ఎయిర్ పోర్టునుంచి హెలికాప్టర్ ద్వారా పీఈఎస్ కళాశాల ఆస్పత్రి ఆవరణలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

11.40: కుప్పం పట్టణం కొత్తపేటలో కన్యాకాపరమేశ్వరి ఆలయంలో పూజలు. **మధ్యాహ్నం 12 నుంచి 2 వరకు:** టీడీపీ కార్యాలయంలో నాయకులతో సమావేశం. **2- 3 వరకు:** విరామం. **3.20 నుంచి సాయంత్రం 5.30 వరకు:** కుప్పం ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో బహిరంగ సభ. **6-7 గంటల మధ్య:** కేవీఆర్ కల్యాణ మండపంలో ముస్లింల ఇఫ్తార్ విందుకు హాజరవుతారు. **7.30 నుంచి రాత్రి 8.30 వరకు:** టీడీపీ కార్యాలయంలో నేతలతో సమీక్ష. **8.45:** ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాత్రి బస

వాట్సాప్ గ్రూపుల్లో వలంటీర్ల ప్రచారం

● ఓటర్లను ప్రభావితం చేసేలా పోస్టులు, వీడియోలు
● వాట్సాప్ డీపీలుగా సీఎం జగన్ ఫొటోలు



చౌడేపల్లె-1 సచివాలయ పరిధిలోని లబ్ధిదారులున్న వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీకి అనుకూలంగా ప్రచారం



చిత్తూరు నగరం రాములవారిగుడి సచివాలయం గ్రూపులో ప్రతి రోజూ వైసీపీ ప్రచార పోస్టులే

చిత్తూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'జగన్ మళ్లీ సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయి. లేకుంటే పెన్షన్లు కూడా ఆగిపోతాయి. ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే' అంటూ వాట్సాప్ గ్రూపుల్లో వలంటీర్లు జోరుగా ప్రచారం చేస్తున్నారు. తద్వారా లబ్ధిదారులను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల కోడ్ వచ్చినా ఇలా చేయడం పట్ల విపక్షాలు అభ్యంతరం వ్యక్తంచేస్తున్నాయి. తమ పరిధిలోని పరిధిలోని లబ్ధిదారులకు అమలయ్యే పథకాల వివరాల కోసం వలంటీర్లు ఓ వాట్సాప్ గ్రూపును క్రియేట్ చేశారు. అందులో రేషన్ ఎప్పుడు వేస్తారు, ఏ పథకానికి ఎలా దరఖాస్తు చేసుకోవాలి, ఎలాంటి డాక్యుమెంట్స్ కావాలి వంటి వివరాలు పోస్ట్ చేయాలి. ఆ గ్రూపుల్లో సచివాలయ కార్యదర్శులూ ఉంటారు. కానీ, ఇప్పుడు లబ్ధిదారులతో నిండిన ఆ వాట్సాప్ గ్రూపుల్లో వైసీపీ ప్రచార వేదికలుగా మారాయి. ఏ గ్రూప్ చూసినా నిత్యం సీఎం జగన్‌కు అనుకూలంగా, టీడీపీకి వ్యతిరేకంగా పోస్టులు పెడుతున్నారు. ఓటర్లను తీవ్ర స్థాయిలో ప్రభావితం చేస్తున్నారు. అయినా అధికారులు ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు అడ్మిన్లుగా ఉన్న ఇలాంటి అధికారిక వాట్సాప్ గ్రూపుల్లో పార్టీల ప్రచారం చేయడాన్ని అధికారులు పర్యవేక్షించకుండా ఉండడం విమర్శలకు తావిస్తోంది. అంతేకాకుండా ఆయా వాట్సాప్ గ్రూపులకు సీఎం జగన్ ఫొటోను డీపీలుగా పెట్టుకుని ఉన్నారు.

ఎన్నికలకు దూరంగా ఉండాలన్నా..

జిల్లాలోని 700లకుపైగా గ్రామ, వార్డు సచివాలయాల్లో 9 వేలకు పైగా వలంటీర్లు పని చేస్తున్నారు. ఎన్నికల విధులకు వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వైసీపీతో అంటకాగుతూ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వారిపై అధికారులు ఎప్పటికప్పుడు విధుల నుంచి తొలగిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు సుమారు 70 మంది వలంటీర్లను తొలగించారు. నాయకులతో కలిసి ప్రచారం చేస్తే ఉద్యోగాలు పోతున్నాయని తెలుసుకుని వాట్సాప్ గ్రూపులను ప్రచారానికి వేదికగా చేసుకున్నారు. ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్, సిమ్‌కార్డు, రీఛార్జీ సౌకర్యాలను వాడుకుంటూ, రూ.5 వేల గౌరవ వేతనం తీసుకుంటూ వైసీపీకి అనుకూలంగా ప్రచారం చేయడం ఏమిటన్న విమర్శలు వస్తున్నాయి. ఇక, వైసీపీ నేతలు కూడా పలువురు వలంటీర్లను ప్రలోభపెట్టి.. బెదిరించి ప్రచారానికి వాడుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి.

పుంగనూరు సదరం క్యాంపులో విచిత్రం

● దరఖాస్తు చేయకున్నా 50 శాతం వికలత్వంతో సర్టిఫికెట్ ఇచ్చారు
● రద్దు చేయమని నాలుగుమార్లు వైద్యశాలకు వచ్చినా పట్టించుకోలేదు
● కడప జిల్లా యువకుడి ఆవేదన



అమరనాథ్ నాయక్‌కు జారీ చేసిన విభిన్న ప్రతిభావంతుడు సర్టిఫికెట్ - నాయక్ ఆధార్ కార్డు

సర్టిఫికెట్ వివరాలిలా..

అమరనాథ్ నాయక్ ఐడీ నెంబరు 11350170511000002తో 2023 జూలై 22వ తేదీన (కుడివైపున నడుము దిగువభాగం దెబ్బతిన్నట్లు) 50 శాతం వికలత్వంతో పుంగనూరు సదరం క్యాంపులో ఆర్థో సివిల్ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ కె.మధుమోహన్, డాక్టర్ జె.కిరణ్‌కుమార్ (సివిల్ అసిస్టెంట్ సర్జన్), డాక్టర్ జస్వంత్‌రాయల్ (సదరన్ క్యాంపు చైర్మన్) కలిసి ఈ వికలత్వం సర్టిఫికెట్ జారీ చేశారు.

పుంగనూరు, మార్చి 24: సదరం క్యాంపునకు వెళ్లి వికలత్వం సర్టిఫికెట్ తీసుకోవాలంటే చాలా పెద్ద ప్రహసనం. ఇప్పటికే అర్హులెందరో నెలల తరబడి తిరుగుతూనే ఉంటారు. కడప జిల్లాకు చెందిన ఓ యువకుడు దరఖాస్తు చేయకున్నా, సదరం క్యాంపునకు వెళ్లకున్నా.. అసలు అర్హుడే కాకున్నా 50 శాతం వికలత్వంతో సర్టిఫికెట్ మంజూరు చేసేశారు. ఈ విచిత్రం పుంగనూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలలో వెలుగు చూసింది. ఆ యువకుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా చక్రాయపేట మండలం కల్లూరుపల్లె పంచాయతీ సుగాలితాండాకు చెందిన బుక్కే జయరాం నాయక్ కుమారుడు బుక్కే అమరనాథ్ నాయక్ (28) ఎంకాం, ఎంఈడీ చేసి గ్రూప్స్, బీఈడీకి చదువుతున్నాడు. విభిన్న ప్రతిభావంతుడిగా సర్టిఫికెట్ మంజూరైనట్లు సచివాలయం నుంచి సమాచారం వచ్చింది. తాను దరఖాస్తు చేయకుండా ఈ మెసేజ్ ఏంటని సచివాలయానికి వెళ్లగా సర్టిఫికెట్ మంజూరవడం చూసి ఆశ్చర్యపోయాడు. పైగా చిత్తూరు జిల్లాలోని పుంగనూరు ఎక్కడ ఉందోకూడా తెలియదు. దీంతో ఓ స్నేహితుడి సాయంతో పుంగనూరు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వెళ్లి సంబంధిత వైద్యుడిని కలిశాడు. తాను ఎలాంటి దరఖాస్తు చేయలేదని.. సదరం క్యాంపునకూ రాలేదని.. 50శాతం వికలత్వంతో సర్టిఫికెట్ ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. ఈ సర్టిఫికెట్‌ను వెంటనే రద్దు చేయాలని కోరాడు. తర్వాత చూస్తామని, మళ్లీ రావాలనడంతో పుంగనూరుకు మొత్తం నాలుగు పర్యాయాలు తిరిగాడు. వైద్యుడిని ఎన్నిసార్లు ప్రాధేయపడినా, ఫోన్లు చేసినా ఫలితం లేకపోయిందని అమరనాథ్ నాయక్ మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్, ఉన్నతాధికారులు విచారించాల్సి ఉంది. ఇలాంటివి ఎలా జరుగుతున్నాయో తేల్చాలి.

'రాజంపేట' లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా నల్లారి కిరణ్

రాయచోటి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాజంపేట లోక్‌సభకు కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆ పార్టీ విడుదల చేసిన జాబితాలో ఆయన పేరు ప్రకటించారు. దీంతో కొన్ని రోజులుగా ఈ స్థానం విషయమై జరుగుతున్న ఊహాగానాలకు ఊహాగానాలకు తెరపడింది. తొలుత రాజంపేట ఎంపీ సీటుకు టీడీపీ తరఫున గంటా నరహరి.. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే టీడీపీ, జనసేన కూటమిలోకి బీజేపీ కూడా చేరింది. ఈ స్థానాన్ని బీజేపీ ఆశించడంతో.. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే తెలుగుదేశం పార్టీ తొలుత బీజేపీకి ప్రకటించిన ఆరు పార్లమెంటు స్థానాలలో రాజంపేట లేదు. ఆ తర్వాత విజయనగరం బదులుగా రాజంపేట స్థానాన్నే బీజేపీ కోరుకుంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో కిరణ్‌కుమార్‌రెడ్డి పేరుంది. కాగా, ఈయన సోదరుడు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలుగుదేశం పార్టీ తరపున పీలేరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.



పేరు: నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి
తండ్రి: నల్లారి అమరనాథ రెడ్డి, మాజీ మంత్రి
పుట్టిన తేదీ: 13.9.1960
భార్య: రాధికా రెడ్డి
కుమారుడు: నిఖిలేష్ రెడ్డి
కుమార్తె: నిహారిక రెడ్డి

తండ్రి మరణానంతరం రాజకీయాల్లోకి..

మాజీ మంత్రి, తన తండ్రి అయిన నల్లారి అమరనాథరెడ్డి మరణానంతరం 1989లో వాయల్పాడు నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి పోటీచేసి విజయం సాధించారు. 1995లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఓటమి.. 1999లో గెలుపు.. 2004లోనూ గెలుపొందారు. ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో 2009లో పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొంది స్పీకర్‌గా పనిచేశారు. వైఎస్ మరణానంతరం రోశయ్య తర్వాత ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రిగా 25.11.2010న కిరణ్ ప్రమాణ స్వీకారం చేశారు. విభజన చట్టానికి నిరసనగా 19.2.2014లో సీఎం పదవికి రాజీనామా చేసిన ఆయన.. 10.3.2014న జైసమైక్యాంధ్ర పార్టీ (జైఎస్‌పీ) స్థాపించారు. ఆ ఎన్నికల్లో ఒక్క చోటా గెలవకపోవడంతో రాజకీయాల నుంచి తాత్కాలికంగా నిష్క్రమించారు. 2018 జూలై 13న జేఎస్పీని రద్దు చేసి తిరిగి కాంగ్రెస్‌లో చేరిన ఆయన.. తర్వాత ఆపార్టీకి రాజీనామా చేసి గతేడాది ఏప్రిల్ ఏడో తేదీన బీజేపీలో చేరారు.

ఈ రంగులు అంతేనా?



బీఎన్ఆర్ పేటలో..



అరతల కనికాపురంలో..

చిత్తూరు రూరల్, మార్చి 24: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చాక ప్రభుత్వ ఆస్తులు, బహిరంగ ప్రదేశాల్లో రాజకీయ పార్టీలకు సంబంధించి ఫ్లెక్సీలు, రంగులు తొలగించాలి. కానీ, రెండు వారాలు అవుతున్నా చిత్తూరు రూరల్ మండలంలోని అధికారులు పట్టించుకోవడంలేదు. బీఎన్ఆర్ పేటలో నూతనంగా నిర్మించిన వాటర్ ట్యాంకుకు, అరతల కనికాపురంలోని నీళ్ల ట్యాంకులకు వైసీపీ జెండా రంగులు అలానే ఉన్నాయి. ఈ రంగులు అధికారులకు కనపడలేదా అని స్థానికులు విమర్శిస్తున్నారు.



చిత్తూరు నగరం చెటపల్లె రోడ్డులో సంతపేట మహిళా సమాఖ్య భవన్‌కు వేసిన వైసీపీ రంగులను నగర పాలక అధికారులు తొలగించలేదు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (సోమవారం) : సా. 6.29
సహరి (మంగళవారం) : ఉ. 4.52

ఎన్నికలకు ముందు గ్రామాలకు రండి

● రాష్ట్రాభివృద్ధికి చంద్రబాబు అవసరంపై ప్రజలకు వివరించండి
● బెంగళూరులోని ప్రవాసాంధ్రుల సమావేశంలో అమర


బెంగళూరులో జరిగిన ప్రవాసాంధ్రులతో మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు, మార్చి 24: 'జిల్లాలో మేనెల 13వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. అంతకు ముందు శని, ఆది, సోమవారాలు సెలవులు వస్తున్నాయి. మరో రెండు రోజులు సెలవు తీసు కోండి. ఇక్కడున్న మీరంతా గ్రామాలకు రండి. బంధువులను, స్నేహితులను కలిసి రాష్ట్రాభివృ ద్ధికి టీడీపీని గెలిపించాల్సిన అవసరం వివరిం చండి. టీడీపీకి ఓట్లు వేయించేలా కృషి చేయండి. మళ్లీ తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వస్తే పరిశ్రమల స్థాపన జరిగి మీరంతా స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతారు' అని మాజీ మంత్రి అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. బెంగళూరులో ఆదివారం జరి గిన ప్రవాసాంధ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మళ్లీ నారాచంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందని మాజీ మంత్రి అమరనాథరెడ్డి పేర్కొన్నారు. ఆది వారం బెంగళూరులో ప్రవాసాంధ్రుల సమావే శంలో ఆయన ప్రసంగించారు. అభివృద్ధిపై విజ న్ ఉన్న నాయకుడు చంద్రబాబు నాయుడ న్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైదరాబాద్‌ను ఎలా అభివృద్ధి చేశారో గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర విభజన తర్వాత పోలవరాన్ని 73 శాతం పూర్తిచేస్తే ఈ ఐదేళ్ల జగన్ పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు తయారైంద న్నారు. జగన్ చేసిన దౌర్భాగ్య పాలన వల్ల రాష్ట్రంలో పరిశ్రమలు రాలేదని, ఉన్నవీ వెళ్లిపో యాయన్నారు. బాబు హయాంలో కియా, రిల యన్స్, హీరో లాంటి ఎన్నో పరిశ్రమలు వచ్చా యని వివరించారు. చిన్న చిన్న పరిశ్రమలు స్థాపిస్తే స్థానికంగా ఉన్న వారికి ఉపాధి లభి స్తుందని, బాబు హయాంలో చిన్నపరిశ్రమలకు ప్రాధాన్యమిచ్చినట్లు చెప్పారు. పలమనేరు లోనూ గుండ్రాజుపల్లి వద్ద పలు పరిశ్రమలు ఏర్పాటు కాగా తాను పరిశ్రమల శాఖా మంత్రిగా ఉన్నప్పుడు పలమనేరు బైపాస్ రోడ్డు పక్కనే ఆటో నగర్ ఏర్పాటు చేశామన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రి చేసేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి ప్రసాదరావు, పలమనేరు నియో జకవర్గ టీడీపీ నాయకులు నాగరాజరెడ్డి, కిషోర్ గౌడ, ఆనంద్, రంగనాథ్, జనసేన నాయకులు దిలీప్, నాగరాజు, చందు, చైతన్య, బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు వినోద్, చేతన్, అంబరీష్, తులసి, రాకేష్, శే ఖర్ తదితరులు పాల్గొన్నారు.

‘తిరుపతి’లో కూటమి రెడీ

జనసేన సీటు ఆరణికే



పేరు: ఆరణి శ్రీనివాసులు
పుట్టిన తేది: 15-5-1952
స్వస్థలం: జంగాలపల్లి, యాదమరి మండలం
నివాసం: చిత్తూరు
భార్య: సత్యవతి
కుమారులు: మదన్ మోహన్, జగన్‌మోహన్
వృత్తి: రాజకీయం, జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్

తిరుపతి అసెంబ్లీ సీటు ఏ పార్టీకి కేటాయిస్తారు? అభ్యర్థిగా ఎవరు ఖరారవు తారు? అన్న ప్రశ్నలు జిల్లావ్యాప్తంగా జనంలోనూ, రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తి రేపిన సంగతి తెలిసిందే. తిరుపతి ప్రాధాన్యత దృష్ట్యా అందరి దృష్టీ దీనిపైనే పడింది. తొలినుంచీ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇక్కడి నుంచే పోటీ చేస్తారన్న ఊహాగానాలు మొదలయ్యాయి. టీడీపీతో జనసేన జతకట్టడంతో ఈ ప్రచారం మరింత ఎక్కువైంది. అయితే ఎందుకో తిరుపతి సీటుపై పవన్ ఆసక్తి చూపలేదు. దీంతో టీడీపీ, జనసేన నేతల నడుమ టికెట్ కోసం పోరు మొదలైంది. చివరి దశలో బీజేపీ నేతలూ రేసులోకి వచ్చారు. చివరికి ఈనెల 13వ తేదీ నాటికి తిరుపతి సీటు పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినట్టు తేలిపోయింది. దానికి తోడు చిత్తూరు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేనలో చేరడంతో ఆయనకే టికెట్ ఖరారైందని పార్టీ వర్గాలకు సమాచారమందింది. దీంతో 14వ తేదీన తిరుపతి టీడీపీ, జనసేన నేతలు సమావేశమై స్థానికులకే టికెట్ ఇవ్వాలని, లేదంటే బయటి వారికి సహకరించకూడదని తీర్మానించారు. ఆరణి శ్రీనివాసులు గో బ్యాక్ అంటూ సాయం త్రానికే ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. అదే రోజు రాత్రి తిరుపతి చేరు కున్న ఆరణి శ్రీనివా సులు 15న నగరం లోని ముఖ్య ఆల యాల్లో పూజలు జరిపి లాంఛనంగా ప్రచారం ప్రారంభిం చారు. టీడీపీ, జన సేన, బీజేపీ నేతల ఇళ్లకు వెళ్లి వారిని కలిసి మద్దతు కోరేందుకు యత్నించారు. అయితే జనసేనలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీలో కోడూరు బాలసుబ్రమణ్యం మినహా మిగిలిన వారు అధినేతలు చెబితే తప్ప మద్దతివ్వమని చెప్పేశారు. వీరితో సర్దుబాటుకు ప్రయత్నిస్తూనే మరోవైపు శ్రీనివాసులు తన పని తాను చేసు కుంటూ పోయారు. పార్టీ ఎన్నికల కార్యాలయం కూడా ప్రారంభిం చారు. దానికి ఎవరూ హాజరు కాకపోగా అదే రోజు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నాయకత్వంలో టీడీపీ నాయకులు సమావే శమై స్థానికులకే టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని డిమాండు చేశారు. స్థానికేతరులకు పనిచేయమని తేల్చి చెప్పారు. జనసేన నేతలను కూడా నాగబాబు మంగళగిరికి పిలిపించి మాట్లాడి పంపించారు. దీంతో అధిష్ఠానం పునరాలోచనలో పడిందని, అభ్యర్థిని మార్చేం దుకు కసరత్తు చేస్తోందని ప్రచారం మొదలైంది. అయితే దానికి భిన్నంగా ఆదివారం జనసేన అధిష్ఠానం అధికారికంగా తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులంటూ ప్రకటన జారీ చేసింది. దీంతో అభ్యర్థి మార్పుపై తలెత్తిన ఊహాగానాలు, ప్రచారాలన్నీ బంద్ అయ్యాయి. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయ కులు, శ్రేణులు కలసికట్టుగా ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం పనిచేయాల్సిన పరిస్థితి తలెత్తింది.అధికారిక ప్రక టన వెలువడ్డాక అసమ్మతి, అస ంతృప్తి వ్యక్తం చేయడం లేదా స్థానికేతర అభ్యర్థి అంటూ వివాదం లేవనెత్తడం అధిష్ఠానాన్ని ధిక్కరించడమే అవుతుంది. టీడీపీ, జనసేన పార్టీలకు కీలకమైన ఈ ఎన్నికల్లో అధిష్ఠానాలను ధిక్కరించే ప్రయత్నం నేతలు చేయ రన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. దీంతో ఒకటి రెండు రోజుల్లో అంతా కలసికట్టుగా ప్రచారం ప్రారంభించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అందరినీ కలుపుకొని పోతా

టికెట్ ఆశించిన ఆశావహుల్లో అసంతృప్తులు ఉండడం సహజమే. అందరినీ కలుపుకొని ముందుకు పోతా. తిరుపతిలో నాకు సొంతిల్లు, వ్యాపార లావాదేవీలు, బంధువర్గం ఉంది. ప్రజా రాజ్యం, తెలుగుదేశం పార్టీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా పనిచేయడంతో తిరుపతితో రాజకీయంగా, సామాజికంగా మెరుగైన పరిచ యాలు ఉన్నాయి. మిత్రపక్షాల సహకారంతో జన సేన పార్టీ విజయం సాధిస్తుంది.

- ఆరణి శ్రీనివాసులు, జనసేన అభ్యర్థి

తిరుపతి జిల్లాలో పెండింగ్ స్థానాలకు కూటమి పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. జిల్లావ్యాప్తంగా పక్షం రోజుల పాటు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని, తిరుపతిలో జనసేన, టీడీపీ, బీజేపీలో అలజడిని రేకెత్తించిన జనసేన అసెంబ్లీ సీటు.. ఎట్టకేలకు ఆరణి శ్రీనివాసులుకే ఖరారైంది. మరోవైపు గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావు తిరుపతి ఎంపీ స్థానానికి కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. దీంతో జిల్లాలో అన్ని స్థానాలకూ కూటమి పార్టీలు ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించేసినట్టయింది. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇప్పటి దాకా కొనసాగిన స్థానిక-స్థానికేతర వివాదాలకు ఇక ముగింపు పలికినట్టయింది. ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కలసికట్టుగా ప్రచారంలోకి దిగే అవకాశముంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

● అసెంబ్లీ అభ్యర్థిగా జనసేన తరపున ఆరణి శ్రీనివాసులే
● బీజేపీ ఎంపీ టికెట్ వరప్రసాదరావుకు
● శాసనసభ స్థానంపై సద్దుమణగనున్న అసమ్మతి

నేపథ్యం: క్లాస్ వన్ కాంట్రాక్టరు అయిన ఆరణి.. ప్రజారాజ్యం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో ఆ పార్టీ తరపున చిత్తూరు అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి చెందారు. ఆపై టీడీపీలో చేరి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ ఆఖరి నిమిషంలో చేజారడంతో వైసీ పీలో చేరి.. పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు వైసీపీ మొండి చేయి చూపడంతో ఈనెల 7న జనసేనలో చేరిన ఆయన.. తిరు పతి టికెట్ సాధించారు.

ఉదయం పార్టీలో చేరి.. సాయంత్రం టికెట్ తెచ్చుకుని

● అన్నంత పని చేసిన వరప్రసాదరావు

గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు అన్నంత పని చేశారు. గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన ఆయ నకు వైసీపీ అధిష్ఠానం మొండిచెయ్యి చూపింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన.. చడీచప్పుడు లేకుండా తిరుపతి పార్లమెంటు పరిధిలో పర్యటించారు. గతంలో ఎంపీగా పనిచేసిన సమయంలో తనతో సన్నిహితంగా మెలిగిన అనుచరులను కలుసుకున్నారు. ఏదో ఒక పార్టీ తరపున ఎంపీగా పోటీ చేస్తానని, తనకు మద్దతివ్వాలని కోరుతూ వచ్చారు. ఆయన ప్రయ త్నాలను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. పొత్తులో భాగంగా తిరుపతి సీటు బీజేపీకి దక్కుతుందనే అంచనాలు రాజకీయ వర్గాల్లో ముందునుంచీ ఉన్నాయి. ఆ పార్టీ తరపున గత ఉప ఎన్నికల్లో పోటీ చేసిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ గానీ లేదా ఆమె కుమార్తె గానీ అభ్యర్థిగా ఉంటారన్న ప్రచారం జరిగింది. అయితే, చాపకింద నీరులా ప్రయత్నాలు సాగించిన వరప్రసాదరావు ఢిల్లీకి వెళ్లి ఆదివారం ఉదయం బీజేపీలో చేరారు. సాయంత్రానికల్లా ఆ పార్టీ ప్రకటించిన ఎంపీ అభ్యర్థుల జాబితాలో తిరుపతి సీటు దక్కించుకుని అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు. రిటైర్డు ఐఏఎస్ అధికారి అయిన ఈయన.. 2009లో ప్రజారాజ్యం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి వచ్చి, ఆ ఏడాది తిరుపతి ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో వైసీపీలో చేరి తిరుపతి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. 2019లో గూడూరు నుంచీ అదే పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ సారి వైసీపీ టికెట్ ఇవ్వకపోవడంతో బీజేపీలో చేరి ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలిచారు.


ఢిల్లీలో కేంద్రమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరుతున్న వరప్రసాద్‌రావు

వైసీపీ ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు వలంటీర్ల తొలగింపు

శ్రీరంగరాజపురం, మార్చి 24: ఎస్ఆర్‌పురం మండలం వేణుగోపాలపురం పంచాయతీలో శు క్రవారం వైసీపీ ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు ఆశోక్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిని విధుల నుంచి తొలగిం చారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వీరిపై చర్యలు తీసుకోవాలంటూ జనసేన ఇన్‌చార్జి పొన్న యుగంధర్ ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకోవాల్సిందిగా గంగాధర నెల్లూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి వెంక టశివను కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. వలం టీర్లు ప్రచారంలో పాల్గొన్నది నిజమేనని నిర్ధా రణ కావడంతో విధుల్లో నుంచి తొలగించారు.

కుప్పంలో ఇద్దరికి షోకాజ్ నోటీసులు

కుప్పం: కుప్పం మండలం నడిమూరు పంచాయతీ హంసాపురంలో వైసీపీ ఎంపీపీ అశ్వినితో కలిసి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు శివరాజు, మణికి అధికారులు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. వీరిపై టీడీపీ నాయకులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి రాజకీయ పార్టీల ప్రచారంలో పాల్గొనడంపై 24 గంట ల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా వారికి ఎంపీడీవో ఖాదర్‌బాషా నోటీసులు జారీ చేశారు. కాగా, అధికార పార్టీకి చెందిన ఎంపీపీతో కలిసి స్వయంగా ప్రచారంలో పాల్గొనడంతోపాటు ఆ పార్టీ జెండాను కూడా ఒక వలంటీరు తలకు చుట్టుకున్నట్లు స్పష్టంగా ఫొటోలో కనిపిస్తున్నా, ఎటువంటి చర్యలూ తీసుకోకుండా షోకాజ్ నోటీ సులు ఇవ్వడం ఏమిటని విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నాయి.



వైసీపీ ప్రచారంలో వలంటీర్

కుప్పం: మండలంలోని పరమసముద్రం గ్రామంలో ఆదివారం జరిగిన వైసీపీ ప్రచా రంలో ఎమ్మెల్సీ భరత్‌తో కలిసి వలంటీరు మోహన్ పాల్గొన్నారు. దీనిపై అధికారులకు టీడీపీ నేతలు ఫిర్యాదు చేశారు.

బీసీలూ.. బీ అలర్ట్

● భూములను వైసీపీ నేతలు ఎలా లాక్కుంటున్నారో అర్థం చేసుకోండి
● సుబ్బారావు కుటుంబానిది ప్రభుత్వ హత్యేనంటూ టీడీపీ విమర్శ


సుబ్బారావు కుటుంబానికి సంతాప సూచకంగా మౌనం పాటిస్తున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, మార్చి 24: రెవెన్యూ రికార్డులను తారుమారుచేసి వైసీపీ నేతలు బీసీల భూములను ఎలా లాక్కుంటున్నారో బీసీలు అర్థం చేసుకోవాలని చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు సీఆర్ రాజన్ సూచించారు. వీరి విషయంలో అప్రమత్తంగా ఉండాలంటూ కడపజిల్లా కొత్త మాధవరంలో చేనే తకు (బీసీ) చెందిన సుబ్బారావు కుటుంబం బలైన విషయాన్ని ప్రస్తావించారు. చిత్తూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుబ్బారావు కుటుంబానిది ముమ్మాటికి వైసీపీ ప్రభుత్వ హత్యేనని ఆరోపించారు. పాల సుబ్బారావుకు చెందిన 3.10 ఎకరాలను వైసీపీ నాయకురాలు కట్టా శ్రావణి అధికారులను అడ్డుపె ట్టుకుని లాక్కోవడంతో అతడి కుటుంబం మనస్తా పంతో ఆత్మహత్య చేసుకుందని చెప్పారు. ఇలా అమాయక ప్రజల భూములను లాక్కోవడానికే సీఎం జగన్ రెడ్డి జీవో నెంబర్ 3 తెచ్చారని చెప్పారు. వీటిలో ఎక్కువగా బీసీలు, అమాయకులు బలవుతు న్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ.. జగన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సురేంద్రకుమార్ మాట్లాడుతూ జీవో నెంబర్ 3 దేశంలో ఎక్కడా లేదన్నారు. టీడీపీ అధికా రంలోకి రాగానే ఈ జీవోను రద్దుచేసి ప్రజల ఆస్తు లకు రక్షణ కల్పిస్తుందన్నారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్ మాట్లాడుతూ అక్రమ సంపాదనలతో వైసీపీ నేతలు ప్రజాప్రతినిధులుగా మారి ప్రజలను, ప్రకృతి సంపదలను దోచుకుంటు న్నారని ఆరోపించారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్న సుబ్బారావు కుటుంబానికి మౌనం పాటించి నివాళులర్పించారు. నేతలు చిట్టిబాబు, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, శ్రీధర్ యాదవ్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ



ఐరాల (కాణిపాకం), మార్చి 24: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినా యక స్వామి ఆలయం ఆది వారం భక్తుల రద్దీతో కిటకి టలాడింది. ఉదయం నుంచి స్వామి దర్శనానికి వేలాదిగా భక్తులు విచ్చేయ డంతో ఆలయ క్యూలైన్లు పూర్తిగా నిండి పోయాయి. దీంతో స్వామి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో భక్తుల మధ్య ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. భక్తుల దాహార్తిని తీర్చడానికి ఆలయ సిబ్బంది తాగునీరు అందించారు.

ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా రవిరాజు

చిత్తూరు రూరల్, మార్చి 24: చిత్తూరు ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌వోగా రవిరా జును నియమిస్తూ కలెక్టర్ షన్మోహన్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి మెడికల్ లీవ్‌పై వెళ్లడంతో డీఐవోగా ఉన్న రవి రాజును ఇన్‌చార్జ్‌గా నియమించారు.

దశాబ్ద ప్రయాణమిలా

● ఎస్వీయూలో బీఏ ఎల్ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సుకు పదేళ్లు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 24: శ్రీవేంకటేశ్వర (ఎస్వీ) యూనివర్సిటీలో 1974లో లా విభాగం ఏర్పాటైంది. ఇప్ప టివరకు అనేకమంది పీజీ, పీహెచ్‌డీలు పూర్తిచేశారు. ఇదే విభా గంలో 2013 నుంచి ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సును ప్రారంభించారు. ఈ ఏడాదితో ఈ కోర్సు పదేళ్ల కాలాన్ని పూర్తి చేసుకుంది. ఈ కోర్సు పూర్తి చేసినవారు న్యాయమూర్తులుగా, న్యాయవాదులుగా, పలు కంపెనీల న్యాయ సలహాదారులుగా స్థిరపడ్డారు. ఈ కోర్సులో భాగంగా విద్యార్థులను హైకోర్టు, సుప్రీంకోర్టుతోపాటు జైళ్ల పరిస్థితులను అవగాహన చేసుకోవడా నికి క్షేత్ర పర్యటనలూ ఉంటాయి. తాజాగా ఢిల్లీలోని సుప్రీంకో ర్టుకు తీసుకెళ్లారు. ప్రతినెలా న్యాయమూర్తులు, న్యాయవాదులతో అవగాహన కార్యక్రమాలు నిర్వ హిస్తున్నారు. ఈ కోర్సును ఇప్పటివరకు 135 మంది పూర్తి చేశారు. 247 మంది చదువుకుంటు న్నారు. వీరికి 8 మంది అకడమిక్ కన్సల్టెంట్లు, ఐదుగురు గెస్ట్ ఫ్యాకల్టీ బోధన చేస్తున్నారు. ఈ కోర్సుకు గౌరవ డీన్‌గా ప్రొఫెసర్ వీఆర్సీ కృష్ణయ్య వేతన రహిత సేవలను అందిస్తుండటం గర్హ నీయం.

ఏపీ లాసెట్ ర్యాంకు ద్వారానే అడ్మిషన్

ఏపీ లాసెట్‌లో వచ్చిన ర్యాంకు ద్వారానే ఈ కోర్సులో అడ్మిష న్ ఉంటుంది. ప్రస్తుతం 55 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 40 సీట్లను ర్యాంకులు, కేటగిరీలవారీగా, ఐదు మాత్రం ఆర్థిక వెనుకబడిన ఉన్నత వర్గాలు, 10 సీట్లను సెల్ఫ్ సపోర్టింగ్ ద్వారా భర్తీ ఇస్తారు. జనరల్ కేటగిరీలో అయితే ఏడాదికి రూ.40వేలు, సెల్ఫ్ ఫైనాన్స్ అయితే ఏడాదికి రూ.90వేల ఫీజు చెల్లించాలి. వీటికి ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబ ర్స్‌మెంట్ సదుపాయం ఉంది. ఈ కోర్సుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉంది.

న్యాయవిద్యకు పెద్దపీట

బీఏ ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న వారు న్యాయమూర్తుల య్యారు. న్యాయ విద్యకు సమా జంలో ప్రాముఖ్యం పెరిగింది. విద్యా ర్థులకు ఉన్నత అవకాశాలు లభిస్తు న్నాయి. అందువల్ల వర్సిటీలో న్యాయ విద్యకు పెద్ద పీట వేస్తున్నాం.

- శ్రీకాంత్ రెడ్డి, వీసీ, ఎస్వీయూనివర్సిటీ



రేపు దశమ వార్షికోత్సవం

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు చంద్రచూడ్, దుర్గాప్రసాద్ రాక

బీఏ ఎల్ఎల్‌బీ కోర్సు దశమ వార్షికోత్సవం మంగళవారం జరగనుంది. రెండ్రోజులపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ లీగల్ ఎడ్యుకేషన్ అంశంపై వర్క్‌షాప్ ఉంటుంది. 28న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి. ఈ వార్షికోత్సవాల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధనుంజయ వై.చంద్రచూడ్, హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్, సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాదులు మహాలక్ష్మీ పావని, జేబీ గుప్తా తదితరులు హాజరు కానున్నారు. శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించే వర్క్‌షాప్‌ను సీజేఐ ప్రారంభించనున్నారు.

చంద్రబాబు సభను విజయవంతం చేయండి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

కుప్పం, మార్చి 24: కుప్పం పట్టణంలో సోమవారం మధ్యాహ్నం తెలుగు దేశం పార్టీ అధినేత చంద్రబాబు పాల్గొననున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, పార్టీ నియోజకవర్గ విస్తరణ కమిటీ కన్వీనర్ డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్నికలను ధీటుగా ఎదుర్కొనే క్రమంలో పార్టీ శ్రేణులకు అధినేత దిశానిర్దేశం చేస్తారని చెప్పారు. అలాగే ఎన్నికల ప్రచారాన్ని కూడా కుప్పంనుంచే ప్రారంభిస్తారని చెప్పారు.

టీబీ రహిత సమాజం నిర్మిద్దాం



చౌడేపల్లె, మార్చి24: టీబీ రహిత సమాజం నిర్మిద్దాం అని హెల్త్ సూపర్‌వైజర్ బహద్దీన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వైద్య సిబ్బందితో కలిసి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలకు టీబీ వ్యాప్తి చెందకుండా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు తగ్గకుండా ఉంటే స్థానిక ప్రభుత్వాసుపత్రిలో పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. టీబీ సోకిన వ్యక్తులకు ప్రతినెలా ఉచితంగా రూ.500 ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది హరి, జమున, ఆశకార్యకర్తలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో మత సామరస్యం

కుప్పం, మార్చి 24: మత సామరస్యాన్ని కాపాడిన ఏకైక నాయకుడు చంద్రబాబేనని టీడీపీ నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో పేద ముస్లిం కుటుంబాలలో అమ్మాయిల వివాహాలకు రూ.50 వేలు పెళ్లికుమార్తె ఖాతాలో జమ చేశారని గుర్తు చేశారు. ఇమామ్‌కు రూ.5 వేలు, మౌసంకు రూ.3 వేలు ప్రతి నెలా వేతనం ఇచ్చారన్నారు. వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా కాపాడారని, ఉర్దూను రెండవ అధికార భాషగా ప్రకటించారని చెప్పారు. జగన్‌రెడ్డి ప్రభుత్వంలో వక్ఫ్ ఆస్తులు వైసీపీ గూండాల కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. సమావేశంలో టీడీపీ సీనియర్ నాకులు సర్దార్‌బాషా, అన్సర్ బాషా, పార్టీ నియోజకవర్గ ముస్లిం మైనారిటీ సెల్ అధ్యక్షుడు జాకిర్, ముజీబ్, గనివుల్లా, నబీ, ఉమర్, జావిద్‌ఖాన్, షబ్బీర్ అలీ, మునాఫ్, ఫైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

63 మందికి కంటిపరీక్షలు

గంగవరం, మార్చి 24 : ఉచిత కంటి వైద్యశిబిరంలో 63 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రఘు తెలిపారు. ఆదివారం లయన్స్‌క్లబ్‌లో పలమనేరుకు చెందిన లేట్ రాచమడుగు కృష్ణయ్యశెట్టి, లేట్ రాధా కృష్ణమ్మల జ్ఞాపకార్థం లయన్స్‌క్లబ్, కుప్పం పీఈఎస్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మొత్తం 63 మందికి కంటిపరీక్షలు నిర్వహించగా, అందులో 22 మందికి లోపం ఉన్నట్లు గుర్తించి ఆపరేషన్‌కు ఎంపిక చేసినట్లు వైద్యులు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ కమిటీ సభ్యులు శ్రీరాములుశెట్టి, రమేష్‌బాబు, ఆర్ఎస్ ప్రకాష్, రాజప్పశెట్టి, డాక్టర్ రాజారెడ్డి, చంద్రయ్యశెట్టి, దివాకర్, జయశంకర్, పీఈఎస్ వైద్యులు హాజరయ్యారు.

నేడు కదిరి పున్నమి వేడుకలు

కల్లూరు, మార్చి 24: పులిచెర్ల మండలం దేవళంపేటలో కొలువైయున్న లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సోమవారం కదిరి పున్నమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు ప్రధాన అర్చకులు అనంతకుమారాచార్యులు తెలిపారు. ఈ వేడుకల్లో భక్తులు పాల్గొని స్వామి కృపకు పాత్రులు కావాలని అర్చకులు కోరారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు



గజవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

పుంగనూరు, మార్చి 24: పుంగనూరులో కల్యాణ వెంకటరమణ స్వామి కల్యాణోత్సవాన్ని టీటీడీ అర్చకులు వైభవంగా నిర్వహించారు. తిరుమల-తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్చకులు స్వామి వారిని సుప్రభాతంతో మేల్కొలిపి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ, హోమం, పూర్ణకుంభ హోమం, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం కల్యాణ వెంకటరమణస్వామి, అమ్మవార్లను కల్యాణ మండపంలో ముస్తాబు చేసి శాస్త్రోక్తంగా వేదమంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ కల్యాణ తంతు నిర్వహించారు. అనంతరం మాడవీధుల్లో గజవాహనంపై శ్రీవారిని ఊరేగించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ మునేంద్రబాబు, ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, పృథ్వీరాజ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కాశీవిశ్వేశ్వరాలయంలో పౌర్ణమి పూజలు

రామకుప్పం, మార్చి 24 : రామకుప్పం పట్టణంలోని అన్నపూర్ణదేవీ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం రాత్రి పౌర్ణమి పూజలు ఘనంగా జరిగాయి. సాయంత్రం అమ్మవారికి పంచామృతాభిషేకం, స్వామి వారికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకాలు నిర్వహించి, విశేష అలంకరణలు చేశారు. మండల పరిధిలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయం ఎదుట కొబ్బరికాయలు కొట్టి, కర్పూరహారతులిచ్చారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.





విశేష అలంకరణలో అన్నపూర్ణదేవీ, కాశీవిశ్వేశ్వరస్వామి, దర్శనం కోసం వేచివున్న భక్తులు

భక్తులతో కిటకిటలాడిన బోయకొండ





ప్రత్యేకాలంకారంలో బోయకొండ గంగమ్మ, దర్శనం కోసం క్యూలైన్లలో వేచియున్న భక్తులు

చౌడేపల్లె,మార్చి24: బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. వేదపండితులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని స్వర్ణాభరణాలతో, పూలతో అలంకరించి, దూపదీప నైవేద్యాలు సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజారెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు. హైదరాబాద్‌కు చెందిన కీర్తన సంగీత అకాడమీకి చెందిన సుహాసిని సంకీర్తనలు ఆలపించారు. వారిని ఆలయ అధికారులు, చైర్మన్ సత్కరించి అమ్మవారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చల్లా సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

రొంపిచెర్ల, మార్చి 24: రొంపిచెర్లలోని చల్లాబాబు ఇంటి వద్ద ఆదివారం పుంగనూరు పట్టణం తూర్పుమొగసాల, నక్కబండ, హైస్కూల్‌వీధికి చెందిన వరదారెడ్డి, వినోద్, ప్రభాకర్, సురేష్, కుమార్‌రెడ్డి, అన్వర్, జమీర్, నూరి, పాపన్న, ఆషీం, పీరాసాహెబ్, సుభాన్‌సాహెబ్, ఫరీద్, రెడ్డిశేఖర్, రామయ్యతోపాటు సుమార్ 40 మంది వైసీపీ కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి చల్లా రామచంద్రారెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే సోమల మండలం పెద్దఉప్పరపల్లె పంచాయతీకి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు మాజీ వైస్ ఎంపీపీ ఉమాపతినాయుడు, మండలపార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు ఆధ్వర్యంలో రొంపిచెర్లలోని చల్లారామచంద్రారెడ్డి నివాసం వద్ద టీడీపీలో చేరారు. పెద్దఉప్పరపల్లెకు చెందిన రాజకుమార్, ఎం.శ్రీకాంత్, గిరి, ధనశేఖర్, హరీష్, రాజేష్, జయప్రకాష్, అనిల్, ఇంద్ర, వెంకటేష్, కళ్యాణ్, మోహన్‌కృష్ణ, ముత్యాలబాబు, రాగూర్‌లకు చల్లా రామచంద్రారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఐ టీడీపీ అధ్యక్షుడు కుమార్, సీవీ రెడ్డి, చిన్నమోహన్‌నాయుడు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

బీజేపీ, టీడీపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలి

పుంగనూరు రూరల్, మార్చి 24: పుంగనూరు ప్రజలు బీజేపీ, టీడీపీ, జనసేన పొత్తు అభ్యర్థుల గెలుపునకు సహకరించాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా నాయకుడు పి.అయూబ్‌ఖాన్ పేర్కొన్నారు. ఆదివారం పుంగనూరులో బీజేపీ, రాష్ట్ర బహుజనుల హక్కుల సాధన సంఘం, టీడీపీ, జనసేన నాయకులు ప్రజాసంఘ నేతలతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ ఓటర్లు రాజకీయ ప్రలోభాలకు దూరమైనప్పుడే ప్రజాస్వామ్యాన్ని కాపాడగలమని తెలిపారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీల కూటమి అభ్యర్థుల గెలుపు కోసం పనిచేయాల్సిన అవసరముందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన బాధ్యత ఓటర్లపై ఉందని, నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి కల్పించి, ప్రజా సంక్షేమం కోసం పని చేసే పార్టీలకు అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో నాయకులు కృష్ణమూర్తి, గంపల గంగరాజు, వెంకట్రామయ్య, నాగరాజ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలపై ప్రచారం చేయాలి

రొంపిచెర్ల, మార్చి 24: చంద్రబాబు ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పుంగనూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి చల్లారామచంద్రారెడ్డి సూచించారు. ఆదివారం రొంపిచెర్లలోని టీడీపీ కార్యాలయంలో రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలతో సూపర్‌సిక్స్ పథకాల గురించి చల్లాబాబు వివరించారు. గ్రామంలో ప్రతి ఇంటింటికి వెళ్లి కరపత్రాలు ఇచ్చి పథకాలను తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రామనాథంనాయుడు, ధనంజయనాయుడు, బండ్లరమేష్, ముల్లంగి వెంకట్రమణ, సురేష్, చంగల్రాయులు, సుబ్బారెడ్డి, రొంపిచెర్లకు చెందిన నాయకులు ఉయ్యాలరమణ, రవినాయుడు, ఓబులేశ్వర్‌రెడ్డి, రామమూర్తి, రఫీ, చెంగల్‌రెడ్డి, సుందరం, రామాంజులు, అమరనాథరెడ్డి, గోవర్ధన్, షేక్‌కరీముల్లా, అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



రామకుప్పం, మార్చి 24: ఓటర్లకు భరోసా కల్పించేందుకు ఆదివారం కేంద్ర రిజర్వు పోలీస్ ఫోర్స్, స్థానిక పోలీసు సిబ్బంది కవాతు నిర్వహించారు. మండల పరిధిలోని మిట్టపల్లె, రాజుపేట, చెల్దిగానిపల్లె గ్రామాల్లో ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో వారు కవాతు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు, ఓటర్లు నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవడానికి తాము అన్నివిధాలా సిద్ధంగా ఉన్నామన్నారు. అదేవిధంగా ఎన్నికల ప్రక్రియలో ఎవరైనా ఆటంకాలు సృష్టిస్తే వారు కఠిన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

బోనమంద సమీపంలో ఏనుగుల సంచారం

సోమల, మార్చి 24 : పేటూరు పంచాయితీ బోనమంద సమీప పొలాల్లో శనివారం రాత్రి ఏనుగులు సంచరించి మామిడి చెట్లను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు. ఏనుగుల సంచారం తెలుసుకున్న రైతులు అటు వైపు పోలేదని తెలిపారు. రాత్రి వేళ వీధుల్లో మంటలు వేసుకుని డప్పులు వాయిస్తూ గడుపు తున్నామని తెలిపారు.

ఘనంగా బేరేశ్వర, బిత్తేశ్వర పూజలు

తలలపై కొబ్బరికాయలు కొట్టించుకొని మొక్కులు తీర్చుకున్న కురబలు





తలలపై కొబ్బరికాయలు కొట్టించుకుంటున్న భక్తులు, జ్ఞాపికలతో మాజీమంత్రి అమర్, ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు

గంగవరం,మార్చి 24 : మండలంలోని కురప్పల్లెలో కురబల ఆరాధ్యదైవమైన బేరేశ్వర, బిత్తేశ్వర స్వామి పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో 32 ఏళ్ల తరువాత నిర్వహించిన ఈ బేరేశ్వర, బిత్తేశ్వర స్వామి పూజలకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా కర్ణాటక నుంచి భారీగా కురబ కులస్తులు తరలివచ్చారు. బేరేశ్వర, బిత్తేశ్వర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం, కొబ్బరికాయలు తలలపై కొట్టే సంప్రదాయాన్ని ప్రారంభించారు. కురుబ కుల పూజారులు, కురబ కులస్తులు పెద్దసంఖ్యలో హాజరై తలలపై కొబ్బరికాయలు కొట్టించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ పూజా కార్యక్రమాలకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి, చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. కురబ కులస్తులు వారిని సాదరంగా ఆహ్వానించి స్వామివార్ల జ్ఞాపికలు అందజేశారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ సైతం హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. కార్యక్రమంలో కురబకుల సంఘ నాయకులు సుబ్రమణ్యంగౌడ్, సోమశేఖర్ గౌడ్, బత్తిగౌడ్, నాగభూషణం, చలపతి స్థానిక నాయకులు ప్రతాప్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రహీంభాష, సురేంద్ర, లోకేష్, బాబాజాన్ పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ డయాలసిస్ సేవలు అభినందనీయం



సమావేశంలో మాట్లాడుతున్న లయన్ రాజశేఖర్ రెడ్డి

పుంగనూరు, మార్చి 24: కిడ్నీ తదితర సమస్యలతో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు పుంగనూరు లయన్స్‌క్లబ్ డయాలసిస్ సెంటర్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎస్వీయూ వీసీ వి.శ్రీకాంత్‌రెడ్డి కొనియాడారు. ఆదివారం మదనపల్లెలో జరిగిన లయన్స్‌క్లబ్ రీజియన్ సమావేశంలో వీసీ మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాలకు అతీతంగా లయన్స్ క్లబ్ సామాజిక సేవలు అందిస్తున్నట్లు వివరించారు. విద్యకు ప్రాధాన్యత పెరిగేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు డాక్టర్ రామరాజు, పీఎం.రాజశేఖర్ రెడ్డి, వీవీ.కృష్ణారెడ్డి, భానుమూర్తిరెడ్డి, రాజారెడ్డి, ముత్యాలు, డాక్టర్ శివ, గౌతమ్‌రెడ్డి, వరదారెడ్డి, త్రిమూర్తిరెడ్డి, అమరావతి సురేశ్, రజి అహ్మద్ పాల్గొన్నారు.

కల్లూరు : కల్లూరు లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలు అభినందనీయమని లయన్స్‌క్లబ్ గవర్నర్ రామరాజ్ ఆర్స్ తెలిపారు. మదనపల్లిలో ఆదివారం నిర్వహించిన రీజన్ మీట్‌లో గ్రామీణ క్రీడలు, పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి కల్లూరు లయన్స్‌క్లబ్ చేస్తున్న సేవలపై ప్రశంసించారు. జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షుడు మహమ్మదాలీకి ప్రశంసాపత్రంతోపాటు బ్యానర్‌ను బహుకరించారు.

ఆవులపల్లెలో ఊరేగిన శ్రీవారు



సోమల, మార్చి 24: సోమల మండలం ఆవులపల్లెలో కొలువుదీరిన ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారు అశ్వ వాహనంపై ఊరేగారు. ఉదయం మూలవిరాట్‌కు విశేష అలంకరణలు చేసి అభిషేక పూజలు నిర్వహించారు. పురోహితులు శాస్త్రోక్తంగా హోమాలు జరిపారు. అనంతరం ఉత్సవమూర్తులను ఊరేగిస్తూ పట్రపల్లె సమీపంలోని పార్వేట్ మండపం వద్దకు చేరుకుని పార్వేట్ ఉత్సవం జరిపారు.

పాలేటమ్మవారికి విశేష పూజలు

సోమల, మార్చి 24: నెల్లిమందలో కొలువుదీరిన పాలేటమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు అమ్మవారికి విశేష పూజలు జరిపారు. టమోటా సీజన్ ప్రారంభంతో రైతులు అమ్మవారి తీర్థాలను తీసుకుని వెళ్లి పంటలపై చల్లారు. చీడ పీడలు వ్యాపించకుండా పంటలు సుభిక్షంగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.

బైరుగానిపల్లెలో విద్యుత్తు ప్రమాదం



కుప్పం, మార్చి 24: కుప్పం పురపాలక సంఘం బైరుగానిపల్లె లో ఆదివారం విద్యుత్తు ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిన ఈ ప్రమాదంలో పాడి రైతు లక్ష్మమ్మ పూరి గుడిసె మొత్తం కాలి బూడిదైంది. పశువులు కూడా ఈ ప్రమాదంలో గాయపడ్డాయి. మూగజీవుల సాయంతో పాడిచేసుకుని జీవనం సాగిస్తున్న తాను జీవనాధారం కోల్పోయానని, ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని లక్ష్మమ్మ కోరుతోంది.

చెరువులో మునిగి యువకుడి మృతి



శ్రీరెడ్డి మృతదేహాన్ని వెలుపలికి తెస్తున్న ఫైర్ సిబ్బంది

కుప్పం, మార్చి 24: కుప్పం వడ్డిపల్లె చెరువులో మునిగి ఒక యువకుడు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. కుప్పం పట్టణానికి చెందిన శ్రీరెడ్డి (35) ఆదివారం స్నేహితులతో కలిసి వడ్డెపల్లె చెరువులో ఈత కొట్టడానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువు నీళ్లలో మునిగి చనిపోయాడు. కుప్పం అగ్నిమాపక శాఖ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించి అతడి మృత దేహాన్ని చెరువునుంచి బయటకు తీసుకు వచ్చింది.

ఘనంగా మట్టల పండుగ



చర్చిలో ప్రార్థన చేస్తున్న పాస్టర్ రాఖేష్‌నిమ్రోద్

పుంగనూరు రూరల్, మార్చి 24: పుంగనూరు సీఎస్ఐ హట్టన్ మెమోరియల్ చర్చిలో మట్టల పండుగను ఆదివారం క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ రాఖేశ్‌నిమ్రోద్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు నడిచిన బాటలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని సూచించారు. అనంతరం చర్చి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రవికుమార్, భరత్‌భూషణ్, సురేశ్, భాస్కర్, సత్యరాజు, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యాధికారిగా డాక్టర్ శ్రీనివాసులు



గంగవరం, మార్చి 24 : ఉత్తమ వైద్యాధికారిగా గంగవరం వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో ఈమేరకు జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్ శ్రీనివాసులుకు ప్రశంసాపత్రం ప్రదానం చేశారు.

రైతు సంఘం నాయకుడు నరసింహులు నాయుడు ఇకలేరు



నరసింహులు నాయుడు (ఫైల్)

కల్లూరు, మార్చి 24: రైతుల సమస్యలపై పోరాటం చేస్తూ భూసమస్యల పరిష్కారానికి ఎనలేని కృషి చేసిన రైతు సంఘం నాయకుడు నరసింహులునాయుడు (88) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందాడు. పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లికి చెందిన నరసింహులునాయుడు రైతుల సమస్యల పోరాట యోధుడుగా పేరు గడించారు. జడ్పీటీసీ సభ్యుడు మురళీధర్, వ్యాపారవేత్త మునిబాల సుబ్రమణ్యంశెట్టి ఆదివారం స్వగ్రామంలో ఈయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు.

ఓటుహక్కు చాలా విలువైనది



ఓటుహక్కుపై అవగాహన ర్యాలీ

గంగవరం, మార్చి 24 : ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు చాలా విలువైనదని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం హరి పేర్కొన్నారు. ఆదివారం గంగవరం డ్రైవర్స్ కాలనీలో వెలుగు మహిళా సమాఖ్య సభ్యులు ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మనం వేసే ఓటు నేతల తలరాతలను నిర్దేశించే శక్తివంతమైనదన్నారు. అలాంటు ఓటును 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు సీసీలు ఎంసీ.బాబు, కొండారెడ్డి, బాలానాయక్, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి


మురళీమోహన్‌ను సన్మానిస్తున్న ఈసీపల్లి గ్రామస్తులు

పూతలపట్టు, మార్చి 24: టీడీపీ హయాంలోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందాయని టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ కలికిరి మురళీమోహన్ అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని ఎర్రచెరువుపల్లి పంచాయతీలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు, బలహీనవర్గాల ప్రజలు మూడుపూటలా పిడికెడు అన్నం తినలేకపోతున్నారని విమర్శించారు. యువతీ యువకులకు మంచి భవిష్యత్తు రావాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. ఎర్రచెరువుపల్లి పంచాయతీకి తొలిసారిగా విచ్చేసిన మురళీమోహన్‌కు ప్రజలు ఘన స్వాగతం పలికారు. మండల కన్వీనర్ దొరబాబు చౌదరి, నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, మాజీ కన్వీనర్ నల్లబోతు మురళీమోహన్, వాణిజ్య విభాగ జిల్లా అధ్యక్షుడు హిమగిరి నాయుడు, నాయకులు ఇంద్రసేన నాయుడు, రెడ్డెప్ప నాయుడు, హేమాద్రి నాయుడు, ధరణి, హేమాద్రి, దాము, దామోదర్, ఏకాంబరం, శ్రీనివాసులు నాయుడు, చిన్నబ్బ నాయుడు, సుబ్రహ్మణ్యం, మురళి, ప్రవీణ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మాజీ సర్పంచ్



కార్వేటినగరం, మార్చి 24: కార్వేటినగరం మండలం టీకేఎం పేట మాజీ సర్పంచ్ గోవిందస్వామి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఆదివారం ఆయన మంగళగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. చిత్తూరు తెలుగు రైతు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు నాగేశ్వరరాజు పాల్గొన్నారు.

సీకే బాబుకు పలువురి శుభాకాంక్షలు


బర్త్‌డే కేక్ కట్‌చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సీకే బాబు

చిత్తూరు సిటీ, మార్చి 24: మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత సీకే బాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఆయన నివాసంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానుల నడుమ భారీ కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. ఈసందర్భంగా టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థులు గురజాల జగన్మోహన్, చల్లా బాబు, మురళీమోహన్‌లు సీకే బాబును దుశ్శాలువ, పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నేతలు కాజూరు బాలాజి, వసంత్ కుమార్, చిట్టిబాబు, పీటర్, పులిగోరు మురళి, సతీష్ కుమార్, దశరథరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు మాదిగల సంఘీభావం


చంద్రబాబును కలిసిన శివయ్యమాదిగ

నగరి, మార్చి 24: మాదిగలు టీడీపీ అధినేత చంద్రబాబుకు సంఘీభావం తెలిపినట్లు నగరి నియోజకవర్గానికి చెందిన శివయ్య మాదిగ పేర్కొన్నారు. మాదిగ పోరాట సమితి ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ నాయకులు శివయ్య మాదిగ ఆధ్వర్యంలో ఆదివారం మంగళగిరిలో చంద్రబాబును కలిసి టీడీపీ గెలుపు కోసం కృషిచేస్తామని చెప్పినట్లు తెలిపారు. నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ గెలుపు కోసం తమ బృందంతో కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు.

డిపాజిట్లు చేసి బ్యాంకు అభివృద్ధికి సహకరించండి

● చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు చైర్మన్ రామగణేష్ పిలుపు


వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న బ్యాంకు చైర్మన్ బి. రామగణేష్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 24: వందేళ్లకు మించి చరిత్ర గలిగి రాష్ట్రంలో మిగిలి వున్న అతి కొద్ది సహకార బ్యాంకుల్లో చిత్తూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు ఒకటని, ఖాతాదారులు విరివిగా డిపాజిట్లు చేసి, బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని బ్యాంకు చైర్మన్ బి. రామగణేష్ అన్నారు. ఆదివారం గిరింపేట బ్రాంచ్ ఆవరణలో బ్యాంకు మహాజన సభ జరిగింది. ఈ సందర్భంగా సభకు అధ్యక్షత వహించిన చైర్మన్ బ్యాంకు నూతన వెబ్‌సైట్ https://cctbank.in/ ను లాంఛనంగా ఆవిష్కరించారు. చైర్మన్ మాట్లాడుతూ మూడేళ్ళక్రితం తమ పాలకవర్గం బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి బ్యాంకును నష్టాల దిశనుంచి లాభాల దిశలోకి తెచ్చారన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా డివిడెంట్ శాతాన్ని ప్రకటించడం లేదని చెప్పారు. బ్యాంకు సీఈవో దొరైస్వామి శ్రీనివాసన్ తొలుత బ్యాంకు వార్షిక నివేదికను ప్రవేశపెట్టారు. బ్యాంకు మాజీ డైరెక్టర్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు రూ.5 లక్షలు డిపాజిట్ ప్రకటించారు. బ్యాంకు అభివృద్ధికి పలువురు 'ఏ' క్లాస్ సభ్యులు సూచనలు అందజేశారు. బ్యాంకు ఉపాధ్యక్షుడు దీనదయాళ్ నాయుడు, డైరెక్టర్లు సి. వెంకటేష్, బి. తంగరాజ్, ఎండీ అస్లాం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌బీ కాంపిటీషన్‌లో బృందావన్ విద్యార్థుల ప్రతిభ


విన్నర్ కప్‌ను స్వీకరిస్తున్న బృందావన్ విద్యార్థులు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 24: తమిళనాడు కాంచీపురంలో నిర్వహించిన నేషనల్ ఫిస్ట్ బాల్ (ఎన్ఎఫ్‌బీ) కాంపిటీషన్‌లో స్థానిక బృందావన్ విద్యార్థులు సత్తా చాటి గోల్డ్ మెడల్ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమార్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కస్టమ్స్ ఆలగేషన్, ఏసీపీ రాజపాండియన్ గోల్డ్ మెడల్‌తో పాటు విన్నర్ కప్‌ను అందజేశారన్నారు. బెస్టు ప్లేయర్లుగా పాఠశాలకు చెందిన బీవీ హాసిని, మనులను మెడల్‌తో సత్కరించినట్లు తెలిపారు. గెలుపొందిన టీం విద్యార్థులను ఆమె అభినందించారు.

మహాలక్ష్మీ అమ్మవారి విగ్రహావిష్కరణ

నిండ్ర, మార్చి 24: మండలంలోని కేఆర్ పాలెం గ్రామంలో వెలసియున్న మహాలక్ష్మీ ఆలయంలో లక్ష్మీదేవి జయంతి సందర్భంగా ఆదివారం 11 అడుగుల అమ్మవారి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అమ్మవారికి, లక్ష్మీనారాయణ స్వామికి పంచామృత అభిషేకం, హోమం, పంచ హారతులు సమర్పించారు. అనంతరం సత్యనారాయణస్వామి వ్రతం జరిగింది. చెంచయ్య నాయుడు కుటుంబం ఉభయదారులుగా వ్యవహరించారు.శీతా ఆశ్రమం పీఠాధిపతి పుండరీక వరదానందస్వామి, అర్చకులు రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వళ్లీ సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం

గుడిపాల, మార్చి 24: మండలంలోని కందగిరి కొండపై వెలసి వున్న వళ్లీ సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవాన్ని ఆదివారం ఆలయ ధర్మకర్త సుబ్రహ్మణ్యం నాయుడు దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం వినాయక, వళ్లీ సుబ్రహ్మణ్యస్వామి, దుర్గమ్మలకు అభిషేకాలు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కల్యాణోత్సవాన్ని పురోహితులచే వైభవంగా నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


మృతిచెందిన ధనపాల్

నగరి, మార్చి 24: నగరి పట్టణ పరిధిలోని మండపం వద్ద ఆదివారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో నిండ్ర మండలానికి చెందిన కొత్త ఆరూరు వాసి ధనపాల్ శెట్టి(58) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... తిరుపతి వైపు వెళుతున్న భారతి బస్సు, నగరి వైపు వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో, దానిపై ఉన్న ధనపాల్ శెట్టి అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నగరి ఏరియా వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుడి అరెస్టు

గుడిపాల, మార్చి 24: మండలంలోని కొత్తపల్లిలో ఆదివారం గుడిపాల పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడుల్లో జేమ్స్ అనే వ్యక్తిని పట్టుకుని రూ.4వేలు స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

కేంద్ర బలగాల కవాతు



గంగాధరనెల్లూరు, మార్చి 24: గంగాధరనెల్లూరు, తూగుండ్రం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం కేంద్ర మిలటరీ బలగాలు కవాతు నిర్వహించాయి. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రజల్లో మానసిక ధైర్యం నింపేందుకు, ప్రశాంతవాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేందుకు కేంద్ర మిలటరీ బలగాలతో కలిసి చిత్తూరు ఏఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు సీఐ శంకర్, పోలీసులు కవాతు నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఎస్ఐ అంజనేయులురెడ్డి, కేంద్ర మిలటరీ బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

కూటమికి మెండుగా జీసస్ దీవెనలు


అప్పయ్యగారిపల్లి చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ప్రతిమ

చిత్తూరు రూరల్, మార్చి 24: కూటమికి జీసస్ దీవెనలు మెండుగా ఉన్నాయని చిత్తూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ సతీమణి ప్రతిమ అన్నారు. ఆదివారం చిత్తూరు రూరల్ మండలంలోని పచ్చనపల్లి, దిగువమాసాపల్లి పంచాయతీలోని అయ్యప్పగారిపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ కరపత్రాలు ఇచ్చి, గెలిస్తే జరిగే మేలును వివరించారు. అనంతరం అప్పయ్యగారిపల్లి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చిత్తూరు ఎంపీ అభ్యర్థి ప్రసాదరావు కుటుంబ సభ్యులు ప్రచారంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోహన్‌రాజ్, శశికర్‌బాబు, జగదీష్‌నాయుడు, కుమార్, శ్రీరామ నాయుడు, జనసేన నాయకులు నవీన్, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం


కుంభాభిషేకంలో పాల్గొన్న మంత్రి రోజా

నగరి, మార్చి 24: నగరి పట్టణ పరిధి కీళపట్టులో నూతనంగా నిర్మించిన పట్టాభి రామాలయంలో ఆదివారం జరిగిన కుంభాభిషేకం పూజల్లో మంత్రి రోజా పాల్గొన్నారు. హోమ పూజలు, పూర్ణాహుతి, కుంభ కలశ ఊరేగింపు కార్యక్రమంలో మంత్రి పాల్గొనగా, వేదపండితులు ఆశీర్వదించారు.

ఘనంగా మట్టల ఆదివారం



బంగారుపాళ్యం, మార్చి 24: మండలంలోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. బంగారుపాళ్యం, తగ్గువారిపల్లె, ముంగరమడుగు, నలగాంపల్లె, కడిరివారిపల్లి, ఎర్రాండ్లపల్లి, లైట్ ఆఫ్ లైఫ్ మినిస్ట్రీ చర్చి, మాధవ నగర్‌లోని బ్లెస్సింగ్ చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఖర్జూరపు మట్టలకు సుగంధ పుష్పాలను అలంకరించి పురవీధుల్లో ఏసుక్రీస్తును స్మరించుకుంటూ పాటలు పాడుతూ, మట్టలను ప్రదర్శిస్తూ తిరిగారు. పాస్టర్లు కిరణ్ జాన్‌పాల్, యోహాన్, శామ్యూల్, జీవన్‌బాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని క్రైస్తవులు మట్టల ఆదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ఇంద్రానగర్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు ఖర్జూరపు మట్టలను ప్రదర్శిస్తూ గ్రామ పురవీధుల్లో తిరిగారు.

కార్వేటినగరం: కార్వేటినగరం బీసీ కాలనీ చర్చి ఆధ్వర్యంలో ఆదివారం మట్టల పండుగను పాస్టర్ ఆశీర్వాదం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.

శాశ్వత హెల్త్ ఆఫీసర్‌ను నియమించాలి

చిత్తూరు, మార్చి 24: చిత్తూరు నగరపాలక సంస్థకు శాశ్వత హెల్త్ ఆఫీసర్‌ను నియమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హెల్త్ ఆఫీసర్ లేకపోవడంతో అర్హత లేనివారిని నియమించారని, దీంతో నగరంలో పారిశుధ్య పనులు ఆశించిన రీతిలో జరగడం లేదన్నారు. మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు హెల్త్ ఆఫీసర్లను నిబంధనల మేర నియమించాల్సి ఉండగా, అర్హతలేని వారిని నియమించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కలెక్టర్ జోక్యం చేసుకుని అర్హత ఉన్న వారిని హెల్త్ ఆఫీసర్‌గా నియమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

బాబు సూపర్ సిక్స్ కరపత్రాల పంపిణీ

విజయపురం, మార్చి 24: మండలంలోని క్షూరికాపురంలో ఆదివారం బాబు సూపర్ సిక్స్ కరపత్రాలను మండల టీడీపీ నాయకులు పంపిణీ చేశారు. నేతలు చుక్కా ధనుంజయయాదవ్, రమేష్‌రాజు, బాబు యాదవ్, గుణభూషణమ్మ, సర్పంచ్ శేఖర్, గజేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల భూ దాహానికి బలవుతున్న పేద కుటుంబాలు


మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

చిత్తూరు సిటీ, మార్చి 24: వైసీపీ నేతల భూ దందాలకు పేద కుటుంబాలు బలవుతున్నాయని టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజల జగన్మోహన్ ఆరోపించారు. ఆదివారం నగరంలోని బీవీ రెడ్డి కాలనీలోఉన్న ఆయన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సాక్షాత్తు సీఎం జగన్ నియోజకవర్గంలోనే వైసీపీ నేతల భూ దాహానికి చేనేత కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం దారుణమన్నారు. ఇలాంటి భూ దందాలు కేవలం కడప జిల్లాలోనే కాదని రాష్ట్రం మొత్తం జరుగుతున్నాయని చెప్పారు. 2024 ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాదని గ్రహించిన జగన్ ప్రజలను ఎలాగైనా దొరికిన కాడికి దోచుకోవాలనే జీవో నెంబర్-3ని తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ జీవోను అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు పేదల భూములపై కన్నేసి, అధికారులను అడ్డుపెట్టుకుని అక్రమంగా భూ దందాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజల ఆస్తులను కాపాడుతామని ప్రమాణం చేసిన ప్రజాప్రతినిధులు ఇలా ప్రజల ఆస్తులను లాక్కోవడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. అలాగే విశాఖపట్నంలో ఇటీవల 25 వేల టన్నుల డ్రగ్స్ పట్టుబడటం వెనుక పూర్తిగా వైసీపీ నేతల హస్తం ఉందన్నారు. వైసీపీ నేతలు రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ విచ్చలవిడిగా విక్రయిస్తూ యువత భవిష్యత్‌ను నాశనం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య పాలన సాగాలంటే, ప్రజల మాన, ప్రాణాలు, ఆస్తులకు రక్షణ కావాలంటే టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సీఎం కావాలని చెప్పారు.

ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు జగన్ కుట్ర: భానుప్రకాష్

నగరి, మార్చి 24: భూహక్కు చట్టం పేరుతో ప్రజల స్థిరాస్తులను లాక్కునేందుకు సీఎం జగన్ కుట్ర పన్నారని నగరి టీడీపీ అభ్యర్థి భానుప్రకాష్ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. కడప జిల్లా ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరంలో చేనేత కుటుంబానికి చెందిన పాలా సుబ్బారావుకు చెందిన 3ఎకరాల భూమిని వైసీపీ నాయకులు లాక్కోవడంతో కుటుంబ సభ్యులందరూ ఆత్మహత్యకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్ హయాంలో ప్రజల ఆస్తులు ఏవిధంగా అన్యాక్రాంతం అవుతున్నాయో చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని ఆయన వివరించారు. కడప జిల్లాలో మూకుమ్మడి హత్యలకు కారణమైన జగన్‌రెడ్డిని రాబోయే ఎన్నికల్లో ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

పోషకాహారంతో టీబీ నివారణ:డీఎంహెచ్‌వో


జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో

చిత్తూరు, మార్చి 24: పోషకాహారం తీసుకోవడం వల్లే టీబీ (క్షయ వ్యాధి)ని పూర్తిగా నివారించవచ్చని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతిదేవి అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా 'అవును క్షయ వ్యాధిని అంతం చేయవచ్చు' అనే నినాదంతో ఆదివారం నగరంలో ప్రభుత్వాస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి నిర్ధారణ అయిన వారికి అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ వెంకటప్రసాద్, ప్రభుతాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్‌కుమార్, డాక్టర్ రవిరాజు, డాక్టర్ శిరీష, డాక్టర్ సాయి షర్మిల, గుణశేఖర్, జార్జ్ తదితరులు పాల్గొన్నారు.

నగరి: నగరి ప్రాంతీయ వైద్యశాల పరిధిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మెడికల్ సూపరింటెండెంట్ ప్రభావతి మాట్లాడుతూ క్షయవ్యాధి నివారణ సామాజిక బాధ్యత అని, మనందరి పంతం.. టీబీ అంతం, టీబీ ఓడిపోతుంది.. దేశం గెలుస్తుంది అని అన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం బంగారుపాళ్యం ప్రభుత్వాస్పత్రి వద్ద నుంచి నాలుగురోడ్ల కూడలి వరకు వైద్య అధికారులు క్షయవ్యాధి నివారణకోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించి, ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు. డాక్టర్ శిరీష, డాక్టర్ మణి, డాక్టర్ అఖిల్, డాక్టర్ జ్యోతిస్వరూప్, డాక్టర్ భార్గవ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో యువకుడికి అస్వస్థత

పాలసముద్రం, మార్చి 24: పాలసముద్రం పోలీసుస్టేషన్‌లో ఓ యువకుడు ఆదివారం అస్వస్థతకు గురయ్యాడు. కార్వేటినగరం సీఐ సత్యబాబు, పాలసముద్రం ఎస్ఐ భారతి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పాలసముద్రం మండలానికి చెందిన ఒక యువతి తిరుపతిలో నర్సు శిక్షణ తీసుకుంటోంది. అనారోగ్యం కారణంగా ఆమెకు తల్లిదండ్రులు చికిత్స చేయించి మండలంలో ఉన్న తమ బంధువుల ఇంట్లో వదిలిపెట్టారు. శనివారం రాత్రి నుంచి ఆ యువతి కనిపించకుండా వెళ్లిపోయింది. దీంతో ఆమె తల్లిదండ్రులు పాలసముద్రం దళితవాడకు చెందిన ఆటోడ్రైవర్ విజయ్‌పై అనుమానం వ్యక్తం చేశారు. విజయ్‌కి స్నేహితుడైన ఎస్ఆర్ఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన మరో ఆటోడ్రైవర్‌తో ఈ యువతి వెళ్లిపోయిందని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేయడంతో ఆదివారం విచారణ నిమిత్తం విజయ్‌ని ఎస్ఐ భారతి అదుపులోకి తీసుకుని, యువతి ఆచూకీ తెలపాలని ఒత్తిడి చేశారు. ఉన్నట్లుండి విజయ్‌కి సాయంత్రం మూర్ఛవ్యాధి (ఫిట్స్) వచ్చి పడిపోయాడు. దీంతో ఆందోళన చెందిన పోలీసులు తమిళనాడులోని షోలింగర్ ప్రభుత్వాస్పత్రికి హుటాహుటిన తరలించి చికిత్స చేయించారు. ఈ విషయం కార్వేటినగరం సీఐ సత్యబాబుకు తెలపడంతో ఆయన స్టేషన్‌కు వచ్చి ఇరు కుటుంబాల వారితో చర్చించారు. విజయ్ కోలుకొని డిశ్చార్జ్ కావడంతో పోలీసులు అతడిని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ విషయం మండలంలో దావానంలా వ్యాపించడంతో పలువురు పోలీసు స్టేషన్‌కు చేరుకుని విజయ్ ఆరోగ్య పరిస్థితి గురించి వాకబు చేశారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిన మిట్టపాళెం వాసులు


భానుప్రకాష్ సమక్షంలో టీడీపీలో చేరిన మిట్టపాళెంవాసులు

నగరి, మార్చి 24: నగరి మండల పరిధిలోని మిట్టపాళెం గ్రామానికి చెందిన నగరి మండల మాజీ వైస్ ఎంపీపీ, వైసీపీ నాయకుడు రవిరెడ్డి తన అనుచరులతో కలిసి ఆదివారం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్, భానుప్రకాష్ హయాంలోనే అభివృద్ధి సాధ్యమని భావించి టీడీపీలో చేరుతున్నట్లు వారు తెలిపారు.

పట్టాభి రామస్వామి కుంభాభిషేకంలో భానుప్రకాష్

నగరి పట్టణ పరిధిలోని కీలపట్టులో నూతనంగా నిర్మించిన పట్టాభిరామస్వామి ఆలయ కుంభాభిషేకంలో భానుప్రకాష్ పాల్గొన్నారు. ఆదివారం ఆయన ఆలయంలో పట్టాభిరామస్వామిని దర్శించుకుని వేదపండితుల ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో నగరి టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, చిత్తూరు జిల్లా ఎస్సీసెల్ కార్యదర్శి అల్లిముత్తు, రాజేంద్రన్, టీడీపీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

టీడీపీ అభ్యర్థులందరూ గెలవాలి

- నగరిలో సామాలమ్మకు మొక్కుకున్న మహిళలు


సామాలమ్మ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

నగరి, మార్చి 24: రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులందరూ గెలవాలని నగరి మహిళలు సామాలమ్మకు మొక్కుకున్నారు. నగరి పట్టణ పరిధిలోని ఒకటవ, మూడవ వార్డుకు చెందిన మహిళలు రామానుజం చలపతి, మాజీ కౌన్సిలర్ లత ఆధ్వర్యంలో ఆదివారం ఎరుపు చీరలు ధరించి, వేపాకు, కర్పూర దీపాలు చేతపట్టి సామాలమ్మ దేవత చుట్టూ ప్రదక్షిణలు చేశారు. కుప్పం నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజారిటీతో చంద్రబాబు గెలిచి ముఖ్యమంత్రి కావాలంటూ వారు పేర్కొన్నారు. చంద్రబాబు, లోకేశ్ ఫొటోలతో కూడిన బోర్డును అమ్మవారి పాదాల వద్ద పెట్టి భక్తితో పూజలు చేసి మొక్కుకున్నారు. కార్యక్రమంలో అలిమేలు, హేమ, రాధ, ఉమ, పుష్ప, ధనమ్మ, కన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

విజయపురం, మార్చి 24: మండలంలోని విజయపురం దళితవాడలో త్రీ స్టార్ టీమ్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు క్రికెట్ టోర్నమెంటు నిర్వహించారు. ఈటోర్నమెంటులో 30 టీములు పాల్గొనగా, విజయపురం దళితవాడ టీమ్ విజేతగా నిలిచింది. ఆదివారం మంత్రి రోజా హాజరై ప్రథమ స్థానంలో నిలిచిన టీమ్‌కు రూ.30 వేలు పంపిణీ చేశారు. రెండవ స్థానంలో నిలిచిన తిరుత్తణి టీంకు విజయపురం సర్పంచ్ మురళీకృష్ణారెడ్డి రూ.20 వేలు పంపిణీ చేశారు. మూడవ స్థానంలో నిలిచిన పన్నూరు టీమ్‌కు సతీష్ యాదవ్ రూ.10 వేలు, నాలుగవ స్థానంలో నిలిచిన నిండ్ర టీంకు సుబ్రహ్మణ్యంరాజు రూ.5 వేలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మంజుబాలాజీ, సర్పంచ్‌లు జపమేరీ ప్రసన్నకుమార్, మురళీకృష్ణారెడ్డి, నాయకులు రాజాదాస్, శివరాజు, కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ కుంభాభిషేకం

పాలసముద్రం, మార్చి 24: మండలంలోని నిశ్శింకాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన మునీశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం ఆదివారం వైభవంగా జరిగింది. అర్చకస్వాములు ఉదయం 9 నుంచి 11 గంటల మధ్య ఉత్తరా నక్షత్రం, అమృతయోగంతో కూడిన వృషభ లగ్నంలో కుంభాభిషేకం పూజలు, కలశపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకల్లో మండల ప్రజలతో పాటు పలువురు రాజకీయ నాయకులు పాల్గొని పూజలు నిర్వహించారు.

వైభవంగా లక్ష్మీనారాయణులకు క్షీరాభిషేకం

● గరుడ వాహనంపై నారాయణుడి దివ్యదర్శనం


గరుడ వాహనంపై అధిష్ఠించిన నారాయణుడికి హారతి ఇస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, మార్చి 24: మండలంలోని వేపంజేరిగ్రామంలో వెలసిన లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు 108లీటర్లతో క్షీరాభిషేకం నిర్వహించారు. ఆలయ గర్భగుడిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత నారాయణ విగ్రహాలకు తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన భాస్కర్ కుటుంబసభ్యులు ఉభయదారులుగా కలశ కుండల్లో 108 లీటర్ల పాలను తీసుకురాగా, అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ క్షీరాభిషేకం పూజలు వైభవంగా నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు. శ్రీదేవి, భూదేవి సమేత నారాయణులకు కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా సాయంత్రం ఆలయ మండపంలో గరుడ వాహనంపై ఉత్సవమూర్తి నారాయణుడి విగ్రహాన్ని అధిష్ఠింపజేసి, పట్టువస్త్రాలు, పూలహారాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు విష్ణుస్వామి, గోవిందస్వామి, ద్వివేది, భక్తులు పాల్గొన్నారు.

కమనీయంగా నటరాజ, రావణబ్రహ్మ వాహన సేవలు


నటరాజ ఉత్సవ సేవలో పాల్గొన్న ఈవో, ఉభయదారులు

చిత్తూరు కల్చరల్, మార్చి 24: స్థానిక కామాక్షి అంబికా సమేతఅగస్త్యేశ్వరాలయంలో గత 11 రోజులుగా స్వామి వారి పంగుణి మాస వార్షిక బ్రహ్మోత్సవాలుఈవో తిమ్మారెడ్డి, ఉత్సవ నిర్వాహకులు శివప్రసాద్‌ల ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం స్వామివారికి అర్చకులు శివాచార్యుల బృందం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి నటరాజ స్వామి అలంకారంలో అలంకరించి పురవీధుల్లో భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవాల్లో నిరంతం జరిగే తీర్థవారి యాగశాల పూజలను అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ముగించారు. బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ధ్వజావరోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం చిత్తూరు జిల్లా వన్నియార్ కుల క్షత్రియ సంఘం ఉభయంతో స్వామి అమ్మవార్లకు కైలాసగిరి రావణబ్రహ్మ వాహన సేవ నిర్వహించారు. వన్నియార్ కుల క్షత్రియ సంఘం నాయకులు కణ్ణన్, దీపక్, ఆనంద్, భక్తులు పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో పల్లకీ, గిరి ప్రదక్షిణ సేవలు

చిత్తూరు కల్చరల్, మార్చి 24: ఫాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా గిరింపేట సత్యసాయి సంస్థాన్ ఆధ్వర్యంలో స్వామివారికి ఆదివారం భక్తి ప్రపత్తులతో పల్లకీ సేవ నిర్వహించారు. గిరింపేట దుర్గాంబ ఆలయంలో అమ్మవారికి అర్చకులు జగదీష్ మాస శాంతి పూజలు నిర్వహించారు. వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవర్లను ప్రత్యేక పూలరథంపై అధిష్ఠింపజేసి స్వామివారి గిరి ప్రదక్షిణలో భాగంగా నగరంలో ఊరేగింపు నిర్వహించారు.

కన్నుల పండుగగా ఆదిదంపతుల కల్యాణం

చిత్తూరు కల్చరల్, మార్చి 24: ఫాల్గుణ మాసం పౌర్ణమి సందర్భంగా నగరంలోని కట్టమంచి బాల కామాక్షి సమేత కులందేశ్వరాలయంలో ఆదివారం అర్చకులు సిద్ధా గురుకుల్ పార్వతి పరమేశ్వరుల కల్యాణోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఉత్సవంలో ఎదురుకోళ్ళు, పావు పందిళ్ల ఘట్టాలు ఎంతో మనోహరంగా అర్చకబృందం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తుతు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవంగా కరకంఠేశ్వరస్వామి కల్యాణోత్సవం

నగరి, మార్చి 24: నగరి పట్టణ పరిధిలోని కామాక్షి సమేత కరకంఠేశ్వరస్వామి ఆలయంలో పంగుణోత్తర తి రు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయం త్రం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

ఘనంగా పులిగుండు గిరిప్రదక్షిణ

పెనుమూరు, మార్చి 24: మండలంలోని పులిగుండు శివాలయంలో వెలసిన పార్వతీపరమేశ్వర్ల ఆలయంలో పౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అర్చకులు అభిషేకాలు, పుష్పాలంకరణచేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం స్వామివారిని శేష వాహనంపై అలంకరించి కొత్తరోడ్డు, రాణావేణుగోపాలపురం, సీఎస్. అగ్రహారం మీదుగా గిరిప్రదక్షిణలో భాగంగా ఊరేగించారు. భక్తులకు మధ్యాహ్నం, రాత్రి అన్నదానం చేశారు. నిర్వాహకులు షణ్ముగరెడ్డి, గోవిందరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా అంకమ్మ తిరుణాళ్ల



విజయపురం, మార్చి 24: మండలంలోని ఎం.అగరంలో అంకమ్మ తిరుణాళ్ల అరుణా మిల్క్ ఎండీ మునిశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం ఆలయ ఆవరణలో అంబలి పోసి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అంకమ్మ తల్లిని పురవీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

అ'పూర్వ'విద్యార్థుల సమ్మేళనం

తిరుపతి(ఆటోనగర్), మార్చి 24: చిత్తూరు పీసీఆర్ జూనియర్ కళాశాలలో 1974-76 మధ్య ఇంటర్మీడియట్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఓ ప్రైవేటు హోటల్లో కలిశారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకుని పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కాగా తాము చదువుకున్న కళాశాల అభివృద్ధికి రూ.లక్ష విరాళంగా అందించారు. గతేడాది రూ.70వేలు విలువగల కుర్చీలను వితరణ చేశారు. అలాగే నాడు-నేడు కింద భవన నిర్మాణాలకు అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేశామన్నారు. ఆ పనులు కూడా శరవేగంగా జరుగుతున్నట్లు గుర్తు చేశారు. ఈ సమ్మేళన కార్యక్రమానికి యూఎస్ఏ, దుబాయ్, హైదరాబాదు, బెంగళూరు, చెన్నై, చిత్తూరుల నుంచి తరలిరావడం విశేషం. ఈ కార్యక్రమంలో హరినాథ్, యుగంధర్, జగన్నాధరెడ్డి, కేశవులు, మనోహర్ రెడ్డి, ఈశ్వర్‌ప్రసాద్, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


చాలా కాలం తరువాత కలసిన పూర్వవిద్యార్థులు